సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 31 । మార్చి । 2024



విశాఖలో ఉర్రూతలే !

డీసీ కెప్టెన్ రిషభ్ పంత్

రవీంద్ర జడేజా

- వైఎస్సార్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌కు ఏర్పాట్లు
- నేడు డీసీ, సీఎస్‌కే మధ్య మ్యాచ్
- నెట్స్‌లో చెమటోడ్చిన ఇరుజట్లు

విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ అభిమానులను అలరించేందుకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) విశాఖ నగరానికి మళ్లీ వచ్చేసింది. వైఎస్సార్ స్టేడియంలో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్లు తలపడనున్నాయి. విజయపరంపరను కొనసాగించేందుకు సీఎస్‌కే పట్టుదలగా ఉండగా హోమ్‌గ్రౌండ్‌లో విజయంతో శుభారంభం చేయడానికి డీసీ జట్టు ప్రణాళిక రచించింది. 2019 ఐపీఎల్ సీజన్ నాకవుట్‌లో క్వాలిఫైయిర్ మ్యాచ్ విశాఖ వేదికగా జరగ్గా ముఖాముఖీ పోరులో డీసీపై సీఎస్‌కే జట్టు విజయం సాధించిన విషయం విదితమే. మళ్లీ ఇప్పుడు మ్యాచ్ జరగనుండడంతో మైదానంలో ప్రత్యక్షంగా మ్యాచ్ చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపిస్తున్నారు. శనివారం ఇరు జట్ల ప్లేయర్లు గ్రౌండ్‌లో సుదీర్ఘ సమయం సాధన చేశాయి. ఇక అభిమానులు అసలు పోరును ఆస్వాదించడమే తరువాయి. గంటలోనే మ్యాచ్ టికెట్లు అమ్ముడుపోగా శనివారం సైతం ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను ఫిజికల్ టికెట్లుగా స్టేడియంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా అభిమానులు రిడీమ్ చేసుకున్నారు.



చెన్నై జట్టు ఫ్రాంచైజీ అధినేతతో ముచ్చటిస్తున్న మ్యాచ్ నిర్వాహక బృందం

స్టేడియంలో భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా సీఎస్‌కే జట్టు ఫ్రాంచైజీ అధినేతతో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి, నగర సీపీ రవిశంకర్ కాసేపు ముచ్చటించారు. మ్యాచ్ ఏర్పాట్లు, భద్రత చర్యల గురించి చర్చించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

విశాఖ సిటీ: ఐపీఎల్ మ్యాచ్‌కు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం జరగనున్న మ్యాచ్‌కు 28 వేల మంది వీక్షకులు స్టేడియానికి వచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు తగ్గట్టుగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు భద్రతా చర్యలతో పాటు మరోవైపు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం వైపు ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. మ్యాచ్‌తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా వేరే మార్గాలలో ప్రయాణించాలని సూచించారు.



సాధన చేస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు



సీఎస్‌కే జట్టు సభ్యుల సాధన



సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్, దీపక్ చాహర్ సమాలోచనలు

న్యూస్‌రీల్

వాల్తేర్ డివిజన్‌కు రికార్డు ఆదాయం



తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ నూతన రికార్డులను సృష్టిస్తోంది. ఇటీవలే ఆదాయార్జనలో, సరకు రవాణాలో సృష్టించిన రికార్డు మరువక ముందే మరో నూతన రికార్డు నెలకొల్పినట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. వివరాలిలా.. వాల్తేర్ డివిజన్ స్క్రాప్ అమ్మకాల్లో రికార్డు ఆదాయాన్ని సంపాదించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో డివిజన్ పరిధిలోని స్క్రాప్‌ను విక్రయించడం ద్వారా రూ.161.53 కోట్లు ఆదాయం సమకూర్చుకుంది. గతేడాది కంటే ఇది 71.5 శాతం అధికంగా ఎగబాకింది. గతేడాది ఆదా యం కేవలం రూ.94.42 కోట్లు మాత్రమే. ఈ ఏడాది 2817.4 మెట్రిక్ టన్నుల స్క్రాప్(ఐరన్, స్లీపర్స్, పనికిరాని వస్తువులు, నాన్ ఫెర్రస్ వంటి) అమ్మకాల ద్వారా రూ.161.53 కోట్లు ఆదాయం సాధించింది. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్, క్యారేజ్ అండ్ వేగన్, లోకో షెడ్స్, ఫైనాన్స్ విభాగాల అధికారులు, సిబ్బందిని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ అభినందించారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీకి నేడే ఆఖరు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ గడువు ఆదివారంతో ముగియనుందని కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, ఖాళీ స్థలాలపై మొత్తం పన్ను బకాయిలతో మార్చి 31లోగా ఒకే సారి చెల్లిస్తే.. వాటిపై విధించిన వడ్డీ మాఫీ పొందవచ్చన్నారు. చెల్లింపుదారుల సౌకర్యార్థం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లోని సౌకర్యం కేంద్రాలు ఆదివారం ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయన్నారు.

- https://www.gvmc.gov.in/లో ఈ పేమెంట్ విభాగంపై క్లిక్ చేయడం ద్వారా..
- జీవీఎంసీ అన్ని సౌకర్యం కేంద్రాల్లో నగదు/డీడీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా..
- ఐడీబీఐ బ్యాంకు సిరిపురం బ్రాంచ్, ఐసీఐసీఐ ద్వారకానగర్ బ్రాంచ్, పంజాబ్ నేషనల్ బ్యాంకు మధురవాడ బ్రాంచ్, యాక్సిస్ బ్యాంకు రాంనగర్ బ్రాంచ్‌ల్లో నగదు/డీడీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా..
- వార్డు సచివాలయాల్లో నగదు/డీడీ, డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లించవచ్చు.

కరోనాతో బాలుడు చనిపోలేదు: డీఎంహెచ్‌వో

మహారాణిపేట: కరోనాతో 14 ఏళ్ల బాలుడు చనిపోయాడన్న వార్తలో నిజం లేదని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. రెండు వారాలుగా మలేరియా జ్వరం, పచ్చకామెర్లతో బాలుడు బాధపడుతున్నట్లు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పాలచర్లకు చెందిన 14 ఏళ్ల బాలుడిని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.20 గంటలకు కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అప్పటికే బాలుడు కీళ్ల వ్యాధికి సంబంధించి స్టెరాయిడ్ థెరపీ తీసుకుంటున్నాడు. తీవ్రమైన జ్వరం, క్లౌడెడ్ సెన్సోరియంతో కేజీహెచ్‌లో చేరాడు. ఆ బాలుడు అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్(ఏఆర్‌డీఎస్), సెప్సిస్, మల్టిపుల్ ఆర్గాన్ డిస్ఫంక్షన్ సిండ్రోమ్(ఎంవోడీఎస్), జువెనైల్ ఇడియోపతిక్ ఆర్థరైటిస్(జేఐఏ), మలేరియా పాజిటివ్(ప్లాస్మోడియం వైవాక్స్)తో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స అందించినట్లు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం 4.25 గంటలకు చనిపోయాడని వివరించారు.

హెచ్‌పీసీఎల్‌తో ఎల్‌అండ్‌టీ ఎంవోయూ



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న షిప్‌యార్డ్ అధికారులు

సింథియా : హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సంస్థ ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ల లాండింగ్ ప్లాట్‌ఫారం, డాక్ వంటి భవిష్యత్తు ప్రాజెక్ట్‌ల కోసం సంస్థ సామర్థ్యాన్ని పెంచే దిశగా ఎల్‌అండ్‌టీ జియో స్ట్రక్చర్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు శనివారం మౌలిక సదుపాయాల అప్‌గ్రేడేషన్‌పై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. 20 నెలల ప్రాజెక్ట్ కాలానికి గానూ దేశీయంగా అత్యాధునికమైన 300 టీ గోలియత్ క్రేన్‌ను ఇన్‌స్టాల్ చేయడంతో పాటు అనుబంధిత మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్, స్లిప్‌వేని అప్‌గ్రేడ్ చేయనున్నట్లు షిప్‌యార్డ్ అధికారులు తెలిపారు.

ఐవీఆర్ఎస్ ఆంతర్యమేమి?

- మొన్న యలమంచిలి, నిన్న పెందుర్తి..
- ఈ అభ్యర్థులపై మరోసారి జనసేన సర్వే
- వారిపట్ల ప్రజల్లో ఉన్న అభిప్రాయంపై ఆరా
- మళ్లీ మార్పులు చేయడానికేనని శ్రేణుల అనుమానం
- జనసేనలో కొనసాగుతున్న గందరగోళం



సాక్షి, విశాఖపట్నం : జనసేనలో రోజుకో గందరగోళానికి తెర లేస్తోంది. సీట్ల ప్రకటన నుంచి ఆరంభమైన ఈ అయోమయం అభ్యర్థులను ఖరారు చేసిన తర్వాత కూడా కొనసాగుతూనే ఉంది. కూటమి పొత్తులో భాగంగా జనసేనకు ఉమ్మడి విశాఖ జిల్లాలో నాలుగు స్థానాలు కేటాయించారు. వీటిలో పెందుర్తి, విశాఖ దక్షిణ, అనకాపల్లి, యలమంచిలి అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో విశాఖ దక్షిణ మినహా మిగిలిన మూడు సీట్లను అధికారికంగా ప్రకటించారు. దక్షిణ సీటును తనకే ఖాయం చేశారంటూ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం మొదలెట్టారు కూడా. దీనిపై జనసేన అధికారిక ప్రకటన వెలువరించకపోవడంతో ఆయన ప్రత్యర్థి వర్గం ఆసరాగా తీసుకుని హడావుడి చేస్తోంది. రెండు రోజుల క్రితం జనసేన అధిష్టానం ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం) ద్వారా యలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్‌పై అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఆయన అభ్యర్థిత్వంపై మీ అభిప్రాయం చెప్పండంటూ ఆ నియోజకవర్గంలో కొంతమంది ఫోన్లకు ఐవీఎఆర్ఎస్ వస్తోంది. ఇప్పటికే టికెట్ ప్రకటించిన అభ్యర్థిపై మళ్లీ ఐవీఆర్ఎస్ ఏమిటంటూ విజయకుమార్‌తో పాటు జనసేన శ్రేణుల్లోనూ అలజడి రేగింది.

పంచకర్ల వర్గీయుల ఉలిక్కిపాటు

ఈ గందరగోళం సద్దుమణగక ముందే తాజాగా పెందుర్తి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుపై కూడా జనసేన అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే చేయిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇది పంచకర్ల వర్గీయులను ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇప్పటికే పెందుర్తి స్థానం పంచకర్లకు ఖరారైందని తెలిసినా.. ఆ సీటు కోసం మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. రోజూ తన అనుచరులతో ఆందోళనలు, నిరసనలు చేయిస్తూ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐవీఆర్ఎస్ సర్వేపై జనసేన నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మార్పు కోసమేనా?

ఈ సర్వేలో యలమంచిలి అభ్యర్థి విజయకుమార్‌కు ప్రతికూలత ఉన్నట్టు తేల్చి ఆ సీటును పంచకర్లకు మార్పు చేస్తారన్న ప్రచారం బాగా జరుగుతోంది. దీంతో పెందుర్తి సీటును బండారుకు కేటాయించే వ్యూహంలో భాగంగా ఈ ఐవీఆర్ఎస్ ఎత్తుగడ అని జనసేన శ్రేణులు శంకిస్తున్నారు. అయితే సుందరపు విజయకుమార్ మాత్రం ఐవీఆర్ఎస్ సర్వేను తామే తరచూ చేయించుకుంటున్నామని సరికొత్త భాష్యం చెబుతున్నారు. అందువల్ల తన సీటు మార్పు జరగదని ధీమాతో ఉన్నారు. అనకాపల్లితో పాటు జనసేన అభ్యర్థులు బరిలో ఉన్న రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇలా నాలుగు రోజులు, వారానికి ఐవీఆర్ఎస్ సర్వే ఎందుకు జరగడం లేదంటూ ఆ పార్టీ శ్రేణులే విస్తుపోతున్నారు. త్యాగరాజుగా పేరు గడించిన తమ అధ్యక్షుడు పవన్ కల్యాణ్.. పెందుర్తి సీటును టీడీపీకి కేటాయించరన్న గ్యారంటీ ఏమిటని వీరు ప్రశ్నిస్తున్నారు. మొత్తమ్మీద రెండు మూడు రోజులుగా జనసేన నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వే ఆంతర్యమేమిటన్నది ఆ పార్టీ వర్గాలకు అస్సలు అంతు చిక్కడం లేదు.

ప్రతి మహిళా స్టార్ క్యాంపెయినరే

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించాలి
- మహిళల ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి ఝాన్సీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ హరివెంకటకుమారి



మహానేత విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధి పొందిన ప్రతి మహిళా మన పార్టీ స్టార్ క్యాంపెయినరే అని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన మేలును వివరించి.. ఓటు అడిగే బాధ్యత మహిళా కార్యకర్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. లాసన్స్‌బే కాలనీలోని వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు అడ్డాల కృపాజ్యోతి ఆధ్వర్యంలో మహిళా నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. విశాఖ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, విశాఖ జోనల్, జిల్లా అనుబంధ విభాగం మహిళా నేతలు పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. జిల్లా మహిళా విభాగం తరఫున ప్రతి రోజూ ఏయే వార్డులో ప్రచారం సాగించాలనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. బొత్స ఝాన్సీ మాట్లాడుతూ మహిళా సాధికారతను చేతల్లో చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చట్టసభలు, రాజకీయ, నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉప అధ్యక్షురాలు పీలా ఉమారాణి, మహిళా నేతలు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా ఎన్నికల నిర్వహణ

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సజావుగా, విజయవంతంగా నిర్వహించేందుకు తగిన ప్రణాళికలతో సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ సూచించారు. జిల్లాలోని వివిధ నోడల్ అధికారులతో శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్లు, తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మెన్ పవర్, మెటీరియల్, ఈవీఎంల మేనేజ్‌మెంట్ తదితర ప్రక్రియల్లో చురుగ్గా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఏప్రిల్ 4న తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ జరగనుందని, 5, 6, 7 తేదీల్లో సిబ్బంది కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 10, 12 తేదీల్లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన ఎన్నికల సిబ్బందికి తొలి విడత శిక్షణ మొదలవుతుందని చెప్పారు. ఈ మేరకు నోడల్ అధికారుల సమక్షంలో చేయాల్సిన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఇదే క్రమంలో ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు త్వరలో అన్ని నియోజకవర్గాల వారిని భాగస్వామ్యం చేస్తూ ఆర్కే బీచ్‌లో సుమారు 10 వేల మందితో వాక్‌థాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు 'మన పోలింగ్ బూత్–మన ఓటు'

మహారాణిపేట: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద లేదా జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో 'మన పోలింగ్ బూత్–మన ఓటు' పేరుతో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జున తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, ఓటర్లకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తారని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

4న యువ శాస్త్రవేత్తల మీట్

సీతంపేట: ఎన్ఎస్‌టీఎల్ ప్రతిష్టాత్మకమైన పదో డీఆర్‌డీవో యంగ్ సైంటిస్ట్స్ మీట్ ఏప్రిల్ 4న ఎన్ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9.15 నుంచి 11.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ముందుగా ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులతో ప్రారంభమై, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్, డీఆర్‌డీవో చైర్మన్ ప్రసంగాల తర్వాత యువ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ హాజరుకానున్నట్టు చెప్పారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

అక్కిరెడ్డిపాలెం: అగనంపూడికి చెందిన జనసేన నాయకుడు బలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 500 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. గాజువాక చట్టివానిపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. వీరికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బలిరెడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన విధానాలకు ఆకర్షితుడనై పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో గుడివాడ అమర్‌నాథ్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొన్నారు.



జనసేన నాయకులకు కండవాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి



వాసుపల్లి సమక్షంలో చేరిన మత్స్యకార మహిళలు

వాసుపల్లికి మత్స్యకార మహిళల మద్దతు

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని జీవీఎంసీ 37వ వార్డు ఫిష్ మార్కెట్‌కు చెందిన మహిళలు తెలిపారు. వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, గనగళ్ల రామరాజు, మీసాల అశోక్‌కుమార్, దూడ అచ్యుత్, గోపి ఆధ్వర్యంలో 200 మందికి పైగా మత్స్యకార మహిళలు వాసుపల్లి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో చేపల వ్యాపారం చేసుకునే కోమలి, రాజు అధ్యక్షతన వీరంతా వాసుపల్లికి జైకొట్టారు. తమకు ఎంతో సేవ చేసిన గణేష్ కుమార్‌కి మద్దతు తెలపడం తమ బాధ్యతని చెప్పారు. వాసుపల్లి మాట్లాడుతూ అన్నగా, తమ్ముడిగా ఆదరిస్తున్న మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని వాసుపల్లి కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది.

'ఫెడక్స్' పేరుతో సైబర్ మోసం

- కొరియర్‌లో డ్రగ్స్ ఉన్నట్లు నగరానికి చెందిన వ్యక్తికి ఫోన్‌లో బెదిరింపులు
- బ్యాంక్ అకౌంట్ తనిఖీ పేరుతో రూ.20 లక్షల టోకరా
- బాధితుడి ఫిర్యాదుతో నిందితులను రాజస్తాన్‌లో అరెస్టు చేసిన సైబర్ పోలీసులు

విశాఖ సిటీ: ఫెడెక్స్ కొరియర్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తికి రూ.20 లక్షల టోకరా వేసిన రాజస్థాన్‌కు చెందిన ఐదుగురు సైబర్ నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన ఒక వ్యక్తికి తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాము ముంబైలోని ఫెడెక్స్ కొరియర్ సర్వీస్ నుంచి ఫోన్ చేస్తున్నట్లు పరిచయం చేసుకున్నారు. ముంబై నుంచి తైవాన్‌కు మీ పేరు మీద బుక్ అయిన పార్సిల్‌లో ఫేక్ పాస్ పోర్టులు, క్రెడిట్ కార్డులు, 720 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ ఉన్నాయని కస్టమ్స్ అధికారులు గుర్తించినట్లు చెప్పాడు. తాను ఎటువంటి పార్సిల్ బుక్ చేయలేదని బాధితుడు చెప్పగా.. అందుకు ఫోన్‌లో వ్యక్తి అతని పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ ఇతర వివరాలు చెప్పాడు. వివరాలు కరెక్ట్‌గా ఉండడంతో బాధితుడు భయపడ్డాడు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదైందని, ఫోన్‌ను నార్కోటిక్ పోలీసులకు బదిలీ చేస్తున్నామని చెప్పాడు. ఇంతలో మరో వ్యక్తి మాట్లాడుతూ విచారణకు ముంబై రావాలని చెప్పగా.. బాధితుడు అంత దూరం రాలేనని సమాధానమిచ్చాడు. అయితే ఆన్‌లైన్‌లోనే విచారణ చేస్తామని, దానికి ఒక స్కైప్ ఐడీ ఇచ్చి లాగిన్ అయి వీడియో కాల్ మాట్లాడాలని, అప్పటి వరకు ఎవరితోను మాట్లాడవద్దని చెప్పారు. తరువాత రోజు మళ్లీ ఫోన్ చేసి మీ అకౌంట్ నుంచి మనీ ల్యాండింగ్, అక్రమ ఆయుధాల రవాణా, టెర్రరిస్టులకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ అవుతోందని చెప్పి బెదిరించారు. ఆర్‌బీఐ మీ అకౌంట్స్‌ను తనిఖీ చేయనుందని, అకౌంట్‌లో ఉన్న డబ్బును తమకు ట్రాన్స్‌ఫర్ చేయాలని, తనిఖీ అనంతరం మళ్లీ డబ్బు వెనక్కు వచ్చేస్తుందని నమ్మించారు. దీంతో భయపడిన బాధితుడు తన అకౌంట్‌లో ఉన్న రూ.20 లక్షలు నేరగాళ్లు చెప్పిన అకౌంట్‌కు బదిలీ చేశాడు. తరువాత నుంచి కాల్ రాలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సీపీ రవిశంకర్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాధితుడు బదిలీ చేసిన బ్యాంక్ అకౌంట్లు రాజస్తాన్‌కు చెందినవిగా గుర్తించారు. దీంతో సైబర్ పోలీసులు అక్కడకు వెళ్లి ఆ వివరాల ప్రకారం ముఠాలో ఐదుగురు సభ్యులైన కమలేష్ దొగివల్, శ్రవణ్ చౌదరి, సీతారాం రాక్‌హ్వోయ, అభిషేక్ జఖర్, దేశ్రాజ్ జఖర్‌లను పట్టుకున్నారు. వారిని అక్కడి కోర్టులో ప్రవేశపెట్టి ట్రాన్సిట్ వారెంట్‌పై విశాఖకు తీసుకువచ్చారు. ఇక్కడ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీపీ రవిశంకర్ తెలిపారు.

సవాళ్లను అధిగమిస్తే ఉన్నత శిఖరాలు

- జీవితంలో పరిమితులు పెట్టుకోకూడదు
- యాక్సిస్ సీఈవో, ఎండీ అమితాబ్ పిలుపు
- ఘనంగా ఐఐఎంవీ 8వ స్నాతకోత్సవం





పట్టా స్వీకరిస్తున్న విద్యార్థిని, ప్రసంగిస్తున్న యాక్సిస్ బ్యాంక్ సీఈవో, ఎండీ అమితాబ్ చౌదరి

బీచ్‌రోడ్డు: సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అప్పుడే ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానానికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ సీఈవో, ఎండీ అమితాబ్ చౌదరి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఐఐఎం విశాఖపట్నం 8వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అమితాబ్ మాట్లాడుతూ వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లే ఆ రంగంలో మెరుగైన స్థానంలో ఉండేలా చేస్తాయన్నారు. జీవితంలో పరిమితులను పెట్టుకోకూడదని విద్యార్థులకు సూచించారు. సత్తా కలిగిన వారికి అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. రానున్న రోజుల్లో భారత దేశం గ్లోబల్ లీడర్‌గా ఎదగబోతుందన్నారు. డిజిటల్ లావాదేవీల్లో భారత్ టాప్‌లో ఉందని చెప్పారు. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వాళ్లు రిస్క్ తీసుకోవాల్సి వస్తుందని.. దానిని అధిగమించి విజయం సాధించాలన్నారు. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలని, అప్పుడే మంచి ఫలితాలను సాధించగలమని వివరించారు. ఐఐఎం విశాఖపట్నం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ హరి ఎస్.భారతియా మాట్లాడుతూ గ్రాడ్యుయేట్స్ ఉపాధి మార్గాలపైనే కాకుండా సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. చిన్న పట్టణాల్లో వ్యాపారాలు వృద్ధి చెందుతున్నాయని, ఈ మార్కెట్‌లోకి ప్రవేశించే వెంచర్‌లతో మంచి విజయాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశంలో మానవ వనరులు ఉన్నప్పటికీ.. తయారీ రంగంలో భారత వాటా చాలా తక్కువగా ఉందన్నారు. ఐఐఎం విశాఖపట్నంలో గడిచిన నాలుగేళ్లలో 144 స్టార్టప్‌లు రూపకల్పన చేయగా.. అందులో 112 మహిళలు స్థాపించడం అభినందనీయమన్నారు. ఇందులో సమాజాన్ని ప్రభావితం చేసే 35 స్టార్టప్‌లు ఉండటం గమనార్హమన్నారు. 2027 నాటికి భారత్ ప్రపంచంలో మూడోవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు.

అటల్ ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు

రూ.10 కోట్లతో 8 కంపెనీల భాగస్వామ్యంతో అటల్ ఇంకుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ ఏడాది మొదటి, రెండు పీహెచ్‌డీలను ప్రదానం చేశామన్నారు. ఈ ఏడాది కొత్తగా ఎంబీఏ కోర్సు ప్రవేశపెట్టామని, హైబ్రిడ్ మోడ్ ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ కోర్సును ప్రవేశపెట్టిన రెండో ఐఐఎంగా విశాఖపట్నం నిలిచిందన్నారు.

8 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం

పీజీపీ ప్రోగ్రాంలో 267 మంది ఉత్తీర్ణత సాధించగా.. వీరిలో అంకిత్ శెట్టి(మొదటి ర్యాంక్), దుశ్యంత్ గుప్తా(రెండో ర్యాంక్) గోల్డ్ మెడల్స్ సాధించారు. వాణి రా మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను సాంగి, ఆల్ రౌండర్ గోల్డ్ మెడల్‌ను దుశ్యంత్ గుప్తా అందుకున్నారు. పీజీపీఈఎక్స్ ప్రోగ్రాంలో 17 మంది ఉత్తీర్ణత సాధించగా గల్లా సత్య అప్పారావు(మొదటి ర్యాంక్), వి.అభిమన్యు(రెండో ర్యాంక్) గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. పీజీపీడీజీఎం ప్రోగ్రాంలో 16 మంది ఉత్తీర్ణత సాధించగా.. సుశాంత్(మొదటి ర్యాంక్), లోకేష్(రెండో ర్యాంక్)కు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో నవ వధువు దుర్మరణం

తగరపువలస: జాతీయ రహదారిపై వలందపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దిలపాలెంలో నివాసం ఉంటున్న నవ వధువు కోడూరు చంద్రతేజ దేవి(24) దుర్మరణం పాలైంది. భీమిలి ఎస్‌ఐ జి.పైడిరాజు తెలిపిన వివరాలివీ.. భీమిలి మండలం శింగనబందకు చెందిన గంగడ పైడిరాజుకు అనకాపల్లిలోని గాంధీనగర్ ఆంజనేయ కాలనీకి చెందిన చంద్రతేజ దేవితో ఈ ఏడాది ఫిబ్రవరి 18న వివాహం జరిగింది. అనంతరం వీరు మద్దిలపాలెంలో స్థిరపడ్డారు. శింగనబందలో జరుగుతున్న పైడితల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్న వీరు.. అమ్మవారిని దర్శించుకుని తిరిగి బైక్‌పై మద్దిలపాలెం ప్రయాణమయ్యారు. వీరి వెనుకనే వస్తున్న లారీ.. బైక్ హ్యాండిల్‌కు తగలడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో చంద్రతేజదేవి చనిపోగా ఆమె భర్త పైడిరాజుకు తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స కోసం సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూ అధికారులపై పీసీసీఎఫ్ ఆగ్రహం!

ఆరిలోవ: జూలో జంతు సంరక్షణపై నిర్లక్ష్యం వహించడంతోనే ఇటీవల వాటి మరణాలు పెరిగాయని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. శుక్రవారం ఆయన జూ పార్కును సందర్శించారు. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. ఇంతవరకు ఉన్న పీసీసీఎఫ్ మధుసూదనరెడ్డి స్థానంలో చిరంజీవి చౌదరి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మొదటిసారిగా విశాఖ జూను శుక్రవారం సందర్శించారు. జూ అధికారులతో ఆయన మాట్లాడి.. వన్యప్రాణుల ఆరోగ్యం, వాటి ఆహారం, భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జూనియర్ దళపతి అనే మగ నీటి ఏనుగు ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నీటి ఏనుగుకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. నాలుగు రోజు కిందట అనారోగ్యంతో మృతి చెందిన జిరాఫీ, ఆరు నెలల కిందట మృతి చెందిన మరో జిరాఫీ, జీబ్రా, మూడు నెలల కిందట ఎలుగుబంటి దాడిలో మృతి చెందిన కీపర్ వివరాలు సేకరించారు. జూలో అరుదైన జంతువులు మృతి చెందడానికి కారణమేమిటని అధికారులను ప్రశ్నించారు. వాటికి సరైన వైద్యం, ఆహారం అందిస్తున్నారా లేదా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశాల నుంచి తీసుకొచ్చిన జంతువుల సంరక్షణపై నిర్లక్ష్యం వహించడం వల్లే మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని మండిపడినట్లు సమాచారం. వన్యప్రాణుల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది.

చైతన్యలో విద్యార్థిని మృతిపై విచారణ వేగవంతం

- ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, ప్రజా సంఘాల ఆందోళన



కొమ్మాది చైతన్య కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న పీడీఎస్‌వో నాయకులు



మాట్లాడుతున్న జయశ్రీ రెడ్డి

మధురవాడ: కొమ్మాదిలోని చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రూపశ్రీ బలవన్మరణంపై ప్రభుత్వం స్పందించింది. ఈ ఘటనపై సాంకేతిక విద్యాశాఖ విచారణకు ఆదేశించింది. పూర్తి స్థాయి విచారణ జరిపి 24 గంటల్లోగా వివరణాత్మక నివేదిక ఇవ్వాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవాలను వెలికి తీసే క్రమంలో ముగ్గురు సభ్యులతో కూడిన బృందాన్ని విచారణ కమిటీగా నియమించినట్టు పేర్కొన్నారు.

కమిటీ సభ్యులు వీరే

పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. చంద్రశేఖర్ నేతృత్వంలో విశాఖపట్నం పాలిటెక్నిక్ మెటలర్జీ విభాగాధిపతి కె. రత్నకుమార్, సివిల్ ఇంజినీరింగ్ లెక్చరర్ డాక్టర్ కె. రాజ్యలక్ష్మి సభ్యులుగా నియమించింది.

సమగ్రంగా విచారణ

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోంది. దీనికి కారకులను గుర్తించేందుకు సీసీ ఫుటేజీలతో పాటు యాజమాన్య ప్రతినిధులు, ఫ్యాకల్టీ, ఇక్కడ పనిచేస్తున్న పురుష సిబ్బందిని కూడా విచారిస్తున్నారు. శుక్రవారం విశాఖ సిటీలో ఓ సీఐతో పాటు భీమిలి, పద్మనాభం పోలీస్ స్టేషన్ల చెందిన సీఐలు దర్యాప్తు చేపట్టారు. అయితే ఘటన జరిగి 36 గంటలు దాటుతున్నా పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడంతో బాలిక తల్లి తండ్రులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

కొమ్మాది చైతన్య కళాశాలలో విద్యార్థిని మృతికి కారణమైన కామాంధ ఫ్యాకల్టీని కఠినంగా శిక్షించాలని జనజాగరణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వాసు డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) అధికారులు సమగ్ర విచారణ చేసి చైతన్య ఇంజినీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌వో ఆందోళన : విద్యార్థిని మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని కళాశాల వద్ద పీడీఎస్‌వో ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్, నాయకులు రుద్రి, ఎల్. భాను తదితరులు మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావుకు మెమోరాండం ఇచ్చినట్టు చెప్పారు.

ముగ్గురు వైద్యులతో పోస్టుమార్టం

మహారాణిపేట: కళాశాల విద్యార్థిని భౌతిక కాయానికి ముగ్గురు వైద్యుల బృందం ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించినట్టు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు. గైనిక్, పెథాలజీ, ఫోరెన్సిక్ విభాగ వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. వారు నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేస్తారు.

కాగా కేసు దర్యాప్తు గురించి రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కర్రి జయశ్రీ రెడ్డి శనివారం పీఎంపాలెం సీఐ రామకృష్ణతో మాట్లాడారు. ఎవరిపై కేసు నమోదు చేశారు.. ఏ సెక్షన్లు పెట్టారో తెలుసుకున్నారు.

ఏపీఎన్‌జీవో సముద్రం లాంటిది



రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడును సత్కరిస్తున్న ఎన్‌జీవో నేతలు

మహారాణిపేట : ఏపీఎన్‌జీవో సముద్రం లాంటిదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్‌జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఏపీ ఎన్‌జీవో ఒకటే ఉండేదని, దీంతో ప్రభుత్వాలు, ఉద్యోగ సంఘాలు భయపడేవన్నారు. ప్రస్తుతం ఎవరికి వారు సంఘాలుగా విడిపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై ప్రభుత్వంతో జరిపిన చర్చలపై రాత పూర్వక హామీలు ఏపీఎన్‌జీవో తరపున సాధించామని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వంతో పోరాడి రెండు డీఏలు, పీఎఫ్ బకాయిలు సాధించామన్నారు. సరెండర్ లీవులపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఎన్నికల తర్వాత ఉద్యోగుల సమస్యల సాధనకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఎన్‌జీవో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తమ నాయుడు , విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వర రావు, ప్రధాన కార్యదర్శి ఆర్.రవి శంకర్ , పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు , ఏయూ నాన్ టీచింగ్ స్టాఫ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌సీలో ఎలుగుబంటి మృతి

ఆరిలోవ: జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ)లో మగ ఎలుగుబంటి మృతి చెందింది. ఈ ఎలుగుబంటి అడవి నుంచి కొద్ది నెలల కిందట శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరులోని పంట పొలాలు, జనారణ్యంలోకి చేరి.. అక్కడి స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. దీన్ని అటవీశాఖ అధికారులు బంధించి విశాఖ జూకు తీసుకొచ్చారు. అప్పటి నుంచి జూ అధికారులు ఈ ఎలుగుబంటిని ఏఆర్‌సీలో సంరక్షిస్తున్నారు. వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా శనివారం వేకువజామున ఇది మరణించినట్లు జూ అధికారులు తెలిపారు. ఈ ఎలుగు బంటి వయసు సుమారు 15 ఏళ్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి



శ్రీనివాసరాజు(ఫైల్)

పరవాడ: లంకెలపాలెం కూడలి వద్ద శుక్రవారం బొగ్గు లారీ బీభత్సంలో తీవ్రంగా గాయపడ్డ హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరాజు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వివరాలు.. విశాఖ పోర్టు నుంచి బొగ్గులోడుతో వెళ్తున్న లారీ శుక్రవారం మధ్యాహ్నం అనకాపల్లి వైపు వెళుతూ లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ద్విచక్ర వాహనంపై ఆగి ఉన్న హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాసరాజును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. శ్రీనివాసరాజు అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో డీసీఆర్బీ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అతడి మృతదేహాన్ని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరాజు 1995 బ్యాచ్ కానిస్టేబుల్‌గా నియమితులయ్యారు. మృతుడికి భార్య రజిని, కుమారుడు అభిరామ్ ఉన్నారు. మృతుడి స్వగ్రామమైన మాకవరపాలెం శివారు నగరం గ్రామంలో ఆదివారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.